# బ్రహ్మ



పురుషోత్తం ఖంగు తిన్నాడు. దిమ్మతిరిగింది. క్షణం సేపు కళ్ళు బయర్లుకమ్మాయి. నోట మాట పెగిలిరాలేదు—

కంపెనీ ఇవ్వడం మొదలు పెట్టి వారం తిరక్కుండానే రెండో సిటింగ్‌లోనే అనంతంఅందర్నీ బేజారెత్తిస్తున్నాడాయె మరి. ఆ రోజు మరో ఇద్దరు తుమ్మాయి వెక్కాయిగాళ్ళతో ఆట మొదలుపెట్టారు. (ఆటలో వేయి తిరగని వాళ్ళకి పురుషోత్తం పెట్టే పేర్లివి) ఆ కాలనీలో ఈ ఆటకు పురుషోత్తంది గురుస్థానం. పేకాట కుటుంబీకులు ఆయన్ని 'బ్రహ్మ'అని అప్పుడప్పుడూ పిలవడం కద్దు.

ఆ రోజు సెషన్ నవ్వుల్తో పరిహాసాల్తో మొదలయింది. పైగా అది వెక్కాయ్యిల్లు. ఆ యిల్లాలు ఆతిథ్యానికి అన్నపూర్ణే. కాఫీ ఫలహారాలు అందివ్వడంలో ఆవిడ గొప్ప ఆనందం పొందుతుంది. అందుకే అక్కడ వేళ ప్రకారం అన్నీ సమకూర్తాయి. 'కాఫీ రుచిగా వుందమ్మా చెల్లాయ్!' అని పురుషోత్తం ఒక్క ముక్కంటే చాలు, మురిసిపోతుంది. వెక్కాయికూడా అంతే. భోళా మనిషి. పొగిడ్తే బెలూనై పోతాడు.

ఆదివారమేమో 'క్రీడాకారులు' గొప్ప ఏకాగ్రతతో ఆడుతున్నారు. ఆ థ్రిల్‌లో డబ్బు పోవడం ఓ లెక్కకాదు. 'అనామకుడు' అనంతం విజృంభించడం అందరికి అంతుపట్టని ఆశ్చర్యం. వాళ్ళ జేబులు తేలికపడుతున్నాయి. అనంతం ముందు నోట్లకుప్ప పెరుగుతోంది.


సూర్యుడు నడినెత్తికెక్కుతున్నాడు. ఆ పూటకు చివరి ఆట జోరుగా సాగుతోంది. తుమ్మాయి ముక్కెత్తాడు. ఒకసారి చెంపలు గోక్కున్నాడు. గొప్ప క్లూ దొరికినట్టు కనుబొమ్మలెగరేసి కళావరు జాకీ పడేశాడు.

ఆ ముక్క చూడంగానే అనంతం మొహం వింతకాంతుల్తో తళుక్ తళుక్‌మంది. లలాటం విజయగర్వంతో ఠీవిగా కదిలింది. కోడిపిల్లని తన్నుకుపోయే డేగలాగా ఠక్కుమని కళావరు జాకీ అందుకున్నాడు. మరోముక్క క్రింద పడేశాడు నిర్లక్ష్యంగా. జయ పతాకలాగా పేకముక్కల్ని రెపరెపలాడించాడు. అందర్నీ లొంగిపొమ్మనట్లు పేకముక్కల్ని క్రింద పరిచాడు—

పురుషోత్తం మొహం పాలిపోయింది. ఫుల్ కౌంట్ ఇవ్వాలి. 'ముక్క పడేసేటప్పుడు అవతలి వాళ్ళ ఆట పసిగట్టాలయ్యా!! తుమ్మాయికి ధర్మ ప్రబోధం వేశాడు లోపల వుబుకుతున్న ఆగ్రహాన్ని అణచుకుంటూ ఓటమిని తుమ్మాయి సీరియ

గోవిందరాజు రామకృష్ణారావు

ఉదయం వారపత్రిక




స్గా తీసుకోలేదు. చెక్కాయి కూడా అంతే. ఇద్దరూ సరదాగా కాలక్షేపం కోసం ఆడారు. నాలుగు డబ్బులు వస్తాయి పోతాయి. పురుషోత్తానికైనా డబ్బు ప్రధానం కాదు. కాని ప్రిస్టేజి దెబ్బతిన్నట్టు ఫీలవుతున్నాడు. తానే లావాగా మారి అనంతాన్ని ముంచెయ్యాలన్నంత కసి లోపల కుతకుత లాడుతోంది. లోగడ పరాజయం ఎదురైన సందర్భాలు చాలా వున్నాయి. అయినా అవివేరు. అసలు పేకాట మూలతత్వమే అది. జయాపజయాలు అనిశ్చితాలు. కాని 'అనామకుడు ఓడించడం పిడుగుపాటే. తేరుకోలేని దెబ్బ'.

అందరూ లేచారు ఇళ్ళకు వెళ్ళడం కోసం. పురుషోత్తం సిగరెట్ ముట్టించి బాగా దమ్ములాగి కిటికీలోంచి పొగ వేగంగా వదిలి మొహం నిండా చిరునవ్వు పులుముకున్నాడు. 'బ్రహ్మాండంగా ఆడావోయ్. అందర్నీ గడగడలాడించేశావ్. హార్టీ కంగ్రాట్యులేషన్స్' అంటూ అనంతం భుజం మీద మెచ్చుకోలుగా చరిచాడు.

'గురువుగారూ! నన్ను అమాంతం ములగ చెట్టెక్కించేస్తున్నారు. హనుమంతుడి ముందు కుప్పిగంతులా!! ఏదో లక్! పైగా మీరు ఇవ్వాళ గట్టిగా తలుచుకోలేదు. నన్ను ఎంకరేజ్ చేయాలనుకున్నారు. అంతే. మీరు మూడ్‌లో వుంటే చిత్తయి పోయేవాళ్ళం. మంచినీళ్ళైనా అడక్కుండా వుడాయించేవాళ్ళం'' అన్నాడు వినీతంగా వంగి నమస్కరిస్తూ.

ఆ ఇల్లాలు లాస్ట్‌రౌండ్ కాఫీ కప్పులందించింది. 'భోజనానికి వెళుతున్నాంగా, ఇప్పుడెందుకమ్మా! అయినా నీచేతి కాఫీ ఎన్నిసార్లు తాగినా రిపీట్ రిపీట్ అనిపిస్తుంది' గ్లాసు అందుకుంటూ పురుషోత్తం కాంప్లిమెంటు చేశాడు.

వేడిగా రెండుగుక్కలు కడుపులోకి పోయాయి. వాటితోపాటు కంఠంలో ఇరుక్కున్న పరాజయ గరళం కొంచెం క్రిందికి దిగినట్లనిపించింది. మచ్చికచేసి మళ్ళీ సాయంత్రం సెషన్‌కి అనంతాన్ని ఎలాగైనా రప్పించి పోయిన డబ్బంతా గుంజేయాలనుకున్నాడు. తుమ్మాయి చెక్కాయి గురించి విడిగా ఆలోచించవలసిందేమీ లేదు. ఇప్పుడు పురుషోత్తానికి ఒకే టార్గెట్—అనంతం.

ఎవరైనా తనని ఘోరంగా ఓడిస్తే పురుషోత్తం అహం దెబ్బ తింటుంది. ఆయన గుండె పురిలా గాండ్రిస్తుంది. పంజాదెబ్బ కొట్టి మంచినీళ్ళు దక్కకుండా చేస్తేగాని క్రోధాగ్ని చల్లారదు. అయితే ఇతరులముందు పైకి గంభీరంగా, ప్రశాంతంగా హిమవన్నగంలా వుండటం ఆయన ప్రత్యేకత. క్రోధాన్ని పైకి రానీయకుండా జయించాడు. అయితే క్రోధాన్నే జయించానని భ్రమపడుతూ 'జితక్రోధేన సర్వంహి జగదేత. ద్విజేయత్' అని స్వోత్కర్ష చేసుకుంటున్నాడు. ఆత్మవంచనని గ్రహిస్తేగా!

అనంతాన్ని సాయంత్రం ఎలాగైనా ముగ్గులోకి లాగాలి. లేకపోతే వ్యూహం కుప్పకూలి పోతుంది. కంటికి కునుకు రాదు. అయితే అనంతం స్వభావం పురుషోత్తానికి అంతుపట్టడం లేదు. నిన్నమొన్నటిదాకా పేకాట గురించి తెలియదన్నట్టుగా వుండేవాడు విక్రమార్కుడై కూర్చున్నాడు. ఆటమీద పెద్ద ఆసక్తి వున్న ఛాయలు కూడా లేవు. ఏం చెప్పగలం? ఏదో పనివుందని సాయంత్రం సిట్టింగ్ ఎగవేస్తే! పురుషోత్తం గుండె ఝల్లుమంది. క్షణం ఆలస్యం చేయకూడదనుకున్నాడు.

'అసాధ్యుడవయ్యా అనంతం. ఈ రోజంతా నీదే పైచేయి. మేం గింగిరాలు కొట్టవలసిందే. అదీ ఒక థ్రిల్లే. ముఖేముఖే సరస్వతీ అన్నారు. ఆదివారం వృధా చేయడం ఎందుకు. సాయంత్రం సెషన్ వేద్దాం. వెన్యూ నిర్ణయమై పోయింది....' పురుషోత్తం మాటకి అడ్డొచ్చి తుమ్మాయి ఆహ్వానం చెప్పాడు.

'గురువుగారి ఆజ్ఞ. చాలాకాలంగా అడుగుతుంటే ఇవ్వాళ్టికి దయ కలిగింది. నా శక్తికొద్దీ ఏర్పాట్లు చేస్తాను. అంతా దయచేయాలి'.

పురుషోత్తం అందుకుని 'వస్తా లేవయ్యా. ఉప్మాలో జీడిపప్పు బాగా తలిగించమని మా చెల్లాయికి చెప్పు' పురమాయించాడు.

అనంతం మౌనంగా వుండిపోయాడు. అదే అంగీకారం అనుకున్నాడు పురుషోత్తం. రుచి మరిగినవాడు ఈ ఆట వదలడం సాధ్యమా అని కారణంకూడా తానే లోలోన వర్ణించుకున్నాడు.

'లంచ్ ప్రోగ్రాం వుంది. వెళ్ళొస్తాను' అని ముక్తసరిగా చెప్పి అనంతం ఇంటి దారిపట్టాడు.

'అన్నట్టు మాపక్కింట్లో వాళ్ళబ్బాయి బర్త్‌డే. మేమూ లంచ్‌కి వెళ్ళాలి' అని తుమ్మాయి చెక్కాయితో అన్నాడు పురుషోత్తం. కానీ లంచ్ మీద ధ్యాస లేదు. సాయంత్రం వేయబోయే సెషన్ తప్ప మరో ఆలోచన లేదు.

తానే ఎన్నిక చేసి పేకదస్తాలు కొంటేగాని పురుషోత్తానికి తృప్తీ, నమ్మకమూ వుండవు. గబగబా బజారుముఖం పట్టాడు.

తుమ్మాయి, చెక్కాయి తామరాకుమీద నీటిబొట్లు. ఇవేం వాళ్ళకి పట్టవు.

పక్కింట్లో లంచ్‌కి అతిథులు రావడం మొదలుపెట్టారు. పరిచయం వుండటం చేత లంచ్‌కి వచ్చిన అనంతం భార్య పురుషోత్తం ఇంటికి వచ్చింది. ఆ ఇల్లాలితో కాసేపు మాట్లాడి వెళ్ళిపోయింది.

పురుషోత్తం కోసం భార్య ఎదురుచూస్తోంది లంచ్‌కి వెళ్ళడం కోసం.

పురుషోత్తం వచ్చాడు.

'కాళ్ళూ చేతులూ కడుక్కోండి. టైం అయింది వెళ్దాం. గెస్ట్స్ చాలామంది వచ్చేసివట్టున్నారు' అని చిరునవ్వుతో నెమ్మదిగా చెప్పింది.

పురుషోత్తం జేబులోంచి రెండు కొత్త పేకదస్తాలు తీసి విసురుగా బల్లమీదికి విసిరివేసి, టవల్ తీసుకుని బాత్‌రూంవైపు రుసరుసమంటూ వెళ్ళాడు.

నీళ్ళు గభాల్న గుమ్మరించిన చప్పుడు వినిపించింది.

ఆ ఇల్లాలు పరిస్థితి గ్రహించింది. ఇలాంటి సన్నివేశాలు కొత్త కావు.

మొహం తుడుచుకుంటూ 'పొద్దువిచ్చిన డబ్బు పాలవాడికిచ్చావా?' బోన్లో నిలబెట్టి విందితుణ్ణి అడిగినట్టుంది ఆ ప్రశ్న.

'అవన్నీ తర్వాత చెబుతాను లంచ్‌కి వెళ్దాం రండి' అని అనునయంగా చెప్పింది ప్రెజంటేషన్‌కని తెచ్చిన బేబీ డాల్‌ని చేత్తో పట్టుకుని.

పురుషోత్తం ఉగ్రుడయ్యాడు.

టవల్ ఆవిడ మొహంమీద విసిరి కొట్టాడు.

'నీకెప్పుడూ తిండి యావే. అప్పుడే కొంప మునిగిపోయినట్టు కిరాణా దుకాణానికి కూడా వెళ్ళొచ్చావా?' పురిమాడు గదిలో మూలగా వున్న

పచారీ సామాను వంక చూస్తూ.

చేతిలో వున్న బేబీ బొమ్మ గిజగిజ కొట్టుకుంటున్నట్లనిపించింది ఆవిడకి. సమాధానం చెప్పకపోతే భర్త కంఠం కాహళ ధ్వనులు చేస్తుందని తెలుసు.

'అవునండి పాలవాడొచ్చి అడిగాడు. ఇచ్చేశాను. ఇంట్లో సరుకులు నిండుకున్నాయి. కావలసినవి పట్టుకొచ్చానండి' దీనంగా బదులిచ్చింది. ఏమి రభస చేస్తాడో, నలుగురూ ఎక్కడ వినిపోతారో అని సిగ్గుతో కుంగిపోతూ, కుమిలిపోతూ.

'ఏడ్వలేక పోయావ్! నాకు అర్జంటుగా డబ్బు కావాలి' కర్కశంగా డిమాండ్ చేశాడు.

'భోజనానికి వెళ్దామండి ముందు' ప్రాధేయపూర్వకంగా చెప్పింది.

పురుషోత్తంలో పశుత్వం విజృంభించింది. గదివైపు ఆవిణ్ణి తోస్తూ నడుంమీద తన్ని 'రాస్కెల్ ముందు ఎంతుంటే అంత డబ్బు తీసుకురా! నోరెత్తావో ప్రాణం తీస్తా' అని అరిచాడు.

ముందుకు పడబోయి తమాయించుకుని గబగబా లోపలికి వెళ్ళింది.

చేతినిండా నలిగిన నోట్లు పట్టుకొచ్చి బల్లమీద పెట్టింది.

పురుషోత్తం వాటిని తేరిపార చూశాడు. నిశ్చేష్టుడయ్యాడు. తనను తాను నమ్మలేక పోయాడు. చేతిలోకి తీసుకుని పరీక్షగా చూశాడు. ముమ్మాటికి అవే!! పొద్దున ఆటల్లో ఓడిపోయినప్పుడు తానే వీటిని అనంతానికిచ్చాడు. సందేహం లేదు. అవి తిరిగి తనింటికెలా వచ్చాయ్??

కోపం భగ్గుమంది. సంస్కారం బుగ్గిగా మారింది.

ఇల్లాలి చెంప ఛెళ్ళుమంది. కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ఎవరో ఇద్దరు తమ ఇంట్లోకి వస్తున్నట్టు మసకగా ఆ నీళ్ళలోంచి కనిపించింది. పొంగివస్తున్న దుఃఖాన్ని గొంతులోనే బిగించుకుంది.

ఇవేవీ పట్టించుకోని పురుషోత్తం 'పొద్దున ఆ అనంతంగాడు గెలుచుకున్న డబ్బు ఇక్కడికెలా వచ్చిందే?.....' మళ్ళీ కొట్టేందుకు చెయ్యెత్తాడు.

అనంతం ఆ చేయి పట్టుకుని 'గురువుగారు ఏదో అస్త్రవిద్యాభ్యాసం చేస్తున్నట్టున్నారు. రాకూడని సమయానికి వచ్చినట్టున్నాం. సారీ ఫర్ది ఇన్‌ట్రూజన్'

ఊహించని ఈ సన్నివేశంతో పురుషోత్తం దిగ్భ్రాంతి చెందాడు. ఏమనాలో తోచలేదు. అనంతం మళ్ళీ అందుకున్నాడు. 'ఆ డబ్బు మా ఆవిడే ఇందాక తిరిగి ఇచ్చింది. మా నాన్న పేకాడేవాడు. నాకూ బాగా వచ్చు. అయితే ఒక కుటుంబాన్ని నిలబెట్టేందుకూ, అవతల వాళ్ళని మార్చేందుకు తప్ప మరెప్పుడూ పేకాడనని మానాన్నకి మాటిచ్చాను. గెలుచుకున్న డబ్బు వాళ్ళకి తిరిగి ఇవ్వాలని మా అబ్బాయిమీద ప్రమాణం చేయించి నా దగ్గర వాగ్దానం తీసుకుంది మా ఆవిడ. అదీ సంగతి... తప్పు మాది. మా అక్కగారిది కాదు. మీతో ఇవ్వాళ పేకాడటంలోని వుద్దేశం అదే. మిమ్మల్ని తర్వాత కలుసుకుని సంగతులన్నీ వివరంగా చర్చించి మిమ్మల్ని ఈ వూబిలోంచీ, ఈ మాయలోంచి బయటకి లాగాలనే చిన్న ప్రయత్నం ఈ ఉదయం చేశాను. మీరు నాకంటే పెద్దవారు. మీకు నీతులు చెప్పేటంతవాణ్ణి కాదు. అన్నట్టు ఇదివరకు రెండు మూడు కేసుల్లో విజయం సాధించాను. నన్ను మన్నించండి' అని చేతులు జోడించాడు.

పురుషోత్తం నిరుత్తరుడయ్యాడు. తనెంత హీనంగా ప్రవర్తించాడో తెలుసుకున్నాడు.

బల్లమీదున్న కొత్త పేకదస్తాలు తీసుకుని పురుషోత్తం వాటిని బరబరా చింపి ముక్కలు చేశాడు.

'థాంక్యూ.... థాంక్యూ అనంతం' అనగలిగాడు గద్గదికంతో.

'ఓ.కె. నథింగ్ టువర్రీ. లంచ్‌కి వెళ్దాం పదండి' అని అందర్నీ ప్రోత్సహించాడు.

నలుగురి హృదయాల్లోనూ ఆనందాలు విరిశాయి..

